## కాలనీల అభివృద్ధికి సహకరించండి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కోట్ల లడ్డూ పటేల్ గురువారం చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణీనగర్, పూర్ణోదయ నగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా రహదారులు, డ్రైనేజీల ఆధునీకరణ చేయకపోవడంతో కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలనీల్లోని అంతర్గత రహదారులు ధ్వంసమయ్యాయని, డ్రైనేజీలు పొంగి ఇళ్ల ముందు పారుతుండటంతో దుర్వాసన వస్తోందని జెడ్సీ చొరవ తీసుకుని కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు


ఏసీపీ సుబ్బరామిరెడ్డి

చాదర్‌ఘాట్: గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. పోలీసులను సమన్వయం చేసుకునేలా మండప నిర్వాహకులు వ్యవహరించాలన్నారు. మూడు పీఎస్‌ల పరిధిలో దాదాపు 15 వరకు పికెటింగ్‌లు ఏర్పాటు చేశామని పోలీసుల నుంచి అనుమతి పొందిన ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు మాత్రమే జరగాలన్నారు. మండపాలు, ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు, మద్యం, మత్తు పదార్థాల వినియోగం, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాలాపూర్ గణనాథుడి విగ్రహానికి విరాళం

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడి విగ్రహానికి అదే ప్రాంతానికి చెందిన పీపీ రెడ్డి గ్రూప్ చైర్మన్ పన్నాల పర్వతాలురెడ్డి ప్రతి ఏటా విరాళం అందిస్తున్నారు. ఇందుకుగాను ఈ సంవత్సరం గణనాథుడి ఉత్సవాలకు రూ.2.65 లక్షల చెక్కును గురువారం పర్వతాలురెడ్డి, కుమారులు వంశీరెడ్డి, కిరణ్‌రెడ్డి కలిసి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంగేటి లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, విష్ణురెడ్డి, పన్నాల రాజేందర్‌రెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## క్రీడా ప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు



బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో గల సిరిపురం యాదయ్య క్రీడా ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను వాకర్స్ క్లబ్ నిర్వాహకులు ముందుకొచ్చి తొలగించారు. ఈ సందర్భంగా మైదానంలో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు, ఇతర వర్థ్యాలను తొలగించి శుభ్రం చేశారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా స్పందించకపోడంతో తాము ముందుకొచ్చామని క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ సభ్యుల సేవలను పలువురు అభినందించారు. పోలీసులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పెద్ద ఉద్యోగాల్లో ఉన్నవారు, కార్పొరేటర్లు, స్థానికులు ఇతరులు ఉన్నారు.


మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు నిర్వహించిన కొప్పుల విఠల్‌రెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి


విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో కేఎస్ఆర్ రెయిన్‌బో అపార్ట్‌మెంట్‌లో గణపతి పూజలో మహిళలు


వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ కూడలిలో పోక చెక్కలు, న్యూస్ పేపర్ గణనాథులు


వాసవి కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి పూజలో పాల్గొన్న కాలనీవాసులు


ఎల్‌బీనగర్ వార్డు కార్యాలయం వద్ద పూజలు చేస్తున్న జగదీష్


అల్కాపురిలో నిర్వహించిన గణేష్ పూజలో పాల్గొన్న దేప సురేఖ భాస్కర్‌రెడ్డి


చైతన్యపురిలో పూజానంతరం సెల్ఫీ తీసుకుంటున్న భక్తులు


హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వద్ద..


మాదన్నపేట బస్తీలో భారీ గణపతితో నిర్వాహకులు

# గణాధిపతయే నమః

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. వివిధ ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసుకుని గణపయ్యను ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. వినాయకుడికి ఇష్టమైన కుడుములు, ఉండ్రాళ్లు, పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తున్నారు. ఆయా మండపాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. - ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


నాగోలు సమతాపురికాలనీలో ఏర్పాటు చేసిన 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం


ఎల్‌బీనగర్ వార్డు కార్యాలయం వద్ద..


మాదన్నపేట పోచమ్మ దేవాలయంలో..


ఎల్‌బీనగర్‌లోని అజాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



## త్వరలో వరద కాలువ పనులు ప్రారంభిస్తాం


సర్వే పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీఆర్ క్రిస్టల్ విల్లాస్ నుంచి మహాలక్ష్మీనగర్ కాలనీ వరకు వరద కాలువ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్‌తో కలిసి వరదనీటి కాలువ సర్వే పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన లెవల్స్‌ను పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శుక్లజ, సర్వేయర్ జ్యోతి, ఏఈ సతీష్, హైడ్రా ఎస్ఐ ముజాఫర్, వనస్థలిపురం ఎస్ఐ అనిల్‌కుమార్, జలమండలి మేనేజర్ సిరివెన్నెల, జీహెచ్ఎంసీ ఏఈ కార్తిక్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

## దివ్యాంగులపై వివక్ష తగదు


జెండాను ఆవిష్కరించిన వీహెచ్‌పీఎస్ నాయకులు

హయత్‌నగర్: దివ్యాంగులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి చెలమండ్ల గోవర్ధన్, కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు అన్నారు. వీహెచ్‌పీఎస్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామని మాట ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఆ మాటే ఎత్తడం లేదని, పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. రాజకీయాల్లో వికలాంగులకు ప్రాధాన్యమిచ్చి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 20 లక్షల మందితో సికింద్రాబాద్‌లో నిర్వహించే మహాసభకు వికలాంగులు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, మల్లేష్, కల్పన, రవి, లక్ష్మారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న యువకుడి మృతి

హస్తినాపురం: కాలికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాలికి గాయమైన గుర్తు తెలియని యువకుడు (32)ను స్థానికులు డయల్ 100 ద్వారా వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసి వైద్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## నిషేధిత దగ్గు మందు విక్రేత రిమాండ్


స్వాధీనం చేసుకున్న దగ్గు మందు బాటిళ్లు

దిల్‌సుఖ్‌నగర్: నిషేధిత దగ్గు మందు తరలిస్తున్న వ్యక్తిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రిమాండ్‌కు తరలించారు. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ కొత్తపేట ప్రాంతానికి చెందిన మూసం లక్ష్మణ్ రోడ్డు నెంబరు-6 అష్టలక్ష్మి టెంపుల్ దగ్గర 102 కోడిన్ పాస్పేట్ దగ్గు మందు బాటిళ్లను కొనుగోలు చేసి తన ద్విచక్ర వాహనంపై మంద మల్లమ్మ చౌరస్తాకు వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదుపులోకి తీసుకున్నారు. రూ.190 ధర కలిగిన ఈ దగ్గుమందు బాటిల్స్‌ను లక్ష్మణ్ రూ.350 అమ్ముతున్నట్లు తెలిపారు. కోడిన్ పాస్పేట్ బాటిళ్లను డ్రగ్స్ అథారిటీ నిషేదించింది. దగ్గు మందును డాక్టర్ చీటితో మాత్రమే అమ్మకాలు చేయాలని కొందరు అక్రమంగా దగ్గు మందును తయారు చేస్తూ అనుమానం రాకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి


నాగోలు చెరువును పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణయ్య


కొలనును పరిశీలిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

నాగోలు: గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచించారు. నాగోలు చెరువులోని వినాయక నిమజ్జన ఏర్పాట్లను కార్పొరేటర్ చింతల అరుణ, సీఐ మక్బుల్‌జానీతో కలిసి గురువారం పరిశీలించారు. చెరువు, రోడ్లు, ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు, లైట్స్, క్యూలైన్స్, బారికేడింగ్ వంటి అంశాలపై అధికారులు చర్చించారు. చెట్ల కొమ్మల తొలగించే పనులు పూర్తిచేసి, విద్యుత్ తీగలను సరిచూసుకోవాలన్నారు. కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ.. పోలీస్ విభాగం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి, మహిళలు, వృద్ధులు, పిల్లలకు వేర్వేరు క్యూలైన్స్ కల్పించాలని, సీసీ కెమెరాల మానిటరింగ్ ద్వారా రియల్-టైమ్ సమీక్ష, కంట్రోల్ రూమ్‌లో ఇంటిగ్రేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగోలు ఎస్సై శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

### నిమజ్జన కొలను పరిశీలన

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనును గురువారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్ నర్సింహారెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి పరిశీలించి మాట్లాడారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ మహేష్‌గౌడ్, ఇంజినీరింగ్ ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం పాల్గొన్నారు.

## వరద సహాయక చర్యల్లో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న కంచర్ల శివారెడ్డి

హస్తినాపురం: వరద ప్రాంతాల్లో ప్రజలకు సహాయక చర్యలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ జాగృతి యూత్ అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి విమర్శించారు. గురువారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మెదక్ జిల్లా రాజాపేటలో వరదలో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యక్తులు కరెంటు స్తంభంపై నాలుగైదు గంటల పాటు ప్రాణాలు నిలుపుకున్నా ప్రభుత్వం మాత్రం వారికి సహాయక చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రాంతాల్లో హెలికాప్టర్లు సకాలంలో పంపి ఉంటే బూరుగుపల్లి గ్రామంలో ఇద్దరి ప్రాణాలు పోయేవి కావని, ప్రజల ప్రాణాలను రక్షించడానికి కాకుండా, పెళ్లిళ్లు, బిహార్ రాజకీయాల కోసం మాత్రం హెలికాప్టర్లు వినియోగిస్తారా ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# డెంగీ గుప్పిట్లో బస్తీలు!

- సరూర్‌నగర్‌లో 26 కేసులు నమోదు
- చాపకింది నీరులా విషజ్వరాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ!




హుడాకాంప్లెక్స్: విష జ్వరాలు ప్రజలకు వణుకు పుట్టిస్తున్నాయి. ఏకధాటి వర్షాలు, వరదలు. వీటికి తోడి పారిశుద్ధ్యలోపం. వెరసి దోమలు విస్తృతంగా పెరిగాయి. అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై పెరిగిన దోమలు, ఈగలతో బస్తీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అధికారికంగా సరూర్‌నగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో జూలై చివరి నాటికి 16 డెంగీ కేసులు నమోదు కాగా, ఆగస్టులో కేవలం 25 రోజుల్లోనే పది కేసులు నమోదు కావడం కలవరపాటుకు గురిచేస్తోంది. ఇక టైఫాయిడ్ బాధితులకు లెక్కలేకుండా పోయింది

### ఫాగింగ్‌ను మరచిన మున్సిపాలిటీ

ప్రస్తుత సీజనల్‌లో పగటి పూట ఎక్కువగా నిద్రించే చిన్నారులు, వృద్ధులు దోమల బారిన పడుతున్నట్లు సమాచారం. డెంగీ కారక దోమల నియంత్రణకు ఎప్పటికప్పుడు పల్లెలు, పట్టణాల్లో ఫాగింగ్ చేపట్టాలి. కానీ ఆ దిశగా పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం వలన ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. వారు తీసుకోవాల్సిన చర్యలు మరచి.. జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రజలకు సూచిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

### నివారణ చర్యలే జాగ్రత్త

వర్షాల కారణంగా వీధుల్లో గుంతలు ఏర్పడే అవకాశం ఉంది. వీటిల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. దీని కారణంగా దోమల సంతతి పెరుగుతుంది. పార్కింగ్ చేసిన వాహనాలు, పనికిరానివి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇంటిపై ఉన్న పాత టైర్లు, డబ్బాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో వాన నీరు చేరడం. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు నిలయంగా మారుతోంది. ఇంటి పరసరాల్లో ఇవి లేకుండా చూసుకోవాలి. ఇంటి ఆవరణలో అందం కోసం ఏర్పాటు చేసే పూల కుండీలు ఒకింత కారణం. ఎప్పటికప్పుడు వాటిలో చేరిన నీటిని తొలగించాలి. పాదళ్లను శుభ్రం చేయడం వలన దోమలను అరికట్టవచ్చు. ప్లాస్టిక్ గ్లాసులు, టీ కప్పు, ప్లాస్టిక్ కవర్లలోకి నీరు చేరుతుంది. వీటిలో దోమలు గుడ్లుపెట్టే అవకాశం ఉంది. వీటిని ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలి. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా మధ్యాహ్న సమయంలో నిద్రపోతుంటారు. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పబడే దుస్తులు ధరించేలా చూసుకోవాలి.

### పరిశుభ్రత ముఖ్యం



మురికి వాడలు, బస్తీల్లో సంపులు తక్కువగా ఉంటాయి. రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా అయ్యే తాగునీటిని పెద్దపెద్ద డ్రమ్ముల్లో నిల్వచేస్తుంటారు. వీటికి మూతలు ఉండకపోవడం వలనడెంగీ కారక దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. విధిగా డ్రమ్ములు, బకెట్లపై మూతలు పెట్టాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. - డాక్టర్ అర్చన, సరూర్‌నగర్ ఆస్పత్రి

## ప్రారంభమైన నిమజ్జనాలు.. నత్తనడకన ఏర్పాట్లు


చిన్న విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనాలు గురువారం ప్రారంభమయ్యాయి. పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరో పక్క చెరువులో సీల్ట్ తొలగించేందుకు ప్రత్యేక జేసీబీలు ఏర్పాటు చేశారు. ఇంకా క్రేన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడవ రోజు శుక్రవారం నుంచి భారీ విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గృహాల్లో ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న విగ్రహాలను గురువారం సరూర్‌నగర్ చెరువు వద్దకు కార్లలో, బైక్‌లపై వచ్చి తమ గణపతి ప్రతిమలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా 65 ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తును గురువారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. క్రేన్‌ల ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ లేని చోట్ల ప్రత్యేకంగా రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు.


కొలను వద్ద నత్తనడకన ఏర్పాట్లు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులో నిమజ్జనానికి వినాయకులు వస్తున్నా... ఏర్పాట్లు మాత్రం నత్తనడకనే నడుస్తున్నాయి. కొలనులో రంగులు వేయటం పూర్తికాలేదు. వాహనాల రాకపోకలకు ఏర్పాట్లు ప్రారంభంకాలేదు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయలేదు. నిమజ్జనం రెండో రోజు కొనసాగుతున్న క్రేన్‌లను ఏర్పాటు చేయలేదు. పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో విగ్రహాలు మునగడం లేదు. వినాయక నిమజ్జనం ఏర్పాట్ల టెండర్ ప్రక్రియ ముగిసి వారం రోజులైనా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయటంలో నిర్లక్ష్యం వహించడంపై భక్తులు మండిపడుతున్నారు.